# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ అందుబాటులోకి తెచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో నిర్మించిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని ఈరోజు ప్రారంభిస్తారు.**

3. **గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులతోపాటు విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.**

5. **తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశామని ఆర్.కృష్ణయ్య చెప్పారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో నిర్మించిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ- సీఆర్డీయే కార్యాలయాన్ని ఈరోజు ప్రారంభిస్తారు. అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్ ఈ3-ఎన్11 జంక్షన్ వద్ద రాయపూడి సమీపంలో ఈ కార్యాలయాన్ని నిర్మించారు. 257 కోట్ల రూపాయల వ్యయంతో, 3.07 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+7 అంతస్తులతో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం విజయవాడ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న సీఆర్డీఏ కార్యాలయం ఇకనుంచి పూర్తిస్థాయిలో అమరావతి నుంచి పనిచేయనుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ తెచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో గత సాయంత్రం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటివరకు 23 మంది నిందితులను గుర్తించామన్నారు. ఈ కేసులో సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం -సిట్ ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

--------------------------

గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం జున్నూరు గ్రామంలో వేడంగి– జున్నూరుపాలెం రహదారి, ప్రభుత్వ పాఠశాల నూతన భవనం అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నంలో గూగుల్ సంస్థ అతిపెద్ద డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనపై ఢిల్లీలో రేపు అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గూగుల్‌తో చారిత్రాత్మక ఒప్పందాన్ని కదుర్చుకుంటున్నామని, 2029 నాటికి డేటా కేంద్రం ఏర్పాటు పూర్తవుతుందని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా విశాఖ మారుతుందని చెప్పారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించనున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. రాజమహేంద్రవరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ సంక్షేమ, చేనేత, జౌళి , లేపాక్షి శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద బీసీ వసతి గృహాలు అభివృద్ధి చేస్తామని తెలిపారు. వసతి గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో నియమితులైన నూతన ఉపాధ్యాయులు ఈరోజు నుంచి పాఠశాలలకు హాజరుకానున్నారని విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కొంతమంది వివిధ శాఖల్లో పనిచేస్తూ డీఎస్సీలో టీచర్లుగా ఎంపికయ్యారని, ఇలాంటి వారంతా ఆయా విభాగాల్లో విధుల నుంచి విడుదలై కేటాయించిన పాఠశాలల్లో చేరాలని సూచించింది. మొత్తం 16 వేల 347 ఉద్యోగాలకు ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన విడుదల చేయగా, 15 వేల 941 పోస్టులు భర్తీ అయ్యాయి.

---------------------------

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన నిన్న మాట్లాడుతూ, బీసీల సంక్షేమమం కోసం ఈ జేఏసీ పనిచేస్తుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ నెల 18వ తేదీన తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు.

---------------------------

అంతర్జాతీయ ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ప్రకృతి విపత్తుల వల్ల సంభవించే నష్టాన్ని తగ్గించి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించేందుకు 1989వ సంవత్సరం నుండి ప్రతి ఏటా అక్టోబర్ 13వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రకృతి విపత్తుల ప్రభావ నియంత్రణ దినాన్ని నిర్వహిస్తోంది. దేశంలో విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం విపత్తు నిర్వహణపై జాతీయ విధానాన్ని రూపొందించారు. సమగ్రమైన వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా విపత్తు ప్రణాళికను భారత ప్రభుత్వం అమలు చేస్తుంది.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన విధంగా వస్తు సేవల పన్ను- జీఎస్టీ తగ్గింపులను ప్రతి ఒక్కరు అమలు చేయాలని ఏలూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఏలూరులో నూతన జిఎస్టీ ధరలు అమలుపై ఔషధ దుకాణాలలో ఆయన నిన్న తనిఖీలు నిర్వహించారు. అనంతరం కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపులను దుకాణదారులందరూ అమలు చేయాలని సూచించారు.

---------------------------

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 48.5 ఓవర్లకు 330 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 331 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

తెలంగాణలో పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================